క్లుప్తంగా

కూలీలకు కనీస వేతనం అందించాలి



దుగ్గిరాల: వేసవిలో ఉపాధి హామీ కూలీలకు మంచినీళ్లు కూడా ఇవ్వడంలేదని గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సీపీఎం నాయకులు జెట్టి బాల రాజు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని పెద్దకొండూరు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం కూలీల పని ప్రదేశానికి ఆయన వెళ్లారు. కనీసం మంచి నీరు, మజ్జిగ గతంలో ఇచ్చేవారని.. ఇప్పుడు ఎందుకు ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో కె.సంసోను, కె.నాగరాజు, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు యూనిఫాం అందజేత



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సచివాలయం-1 పరిధిలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో ఫిరంగిపురం పీహెచ్‌సీ పరిధిలోని ఎనిమిది గ్రామాల ఆశా వర్కర్లకు మంగళవారం వైద్యులు శ్వేత యూనీఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఏటా ఒక జత యూనీఫాం అందజేస్తున్నట్లు తెలిపారు. 33 మంది ఆశా వర్కర్లకు యూనీఫాం అందించినట్లు తెలిపారు. సీహెచ్‌వో వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన నేడు



రామచంద్రాపురం(మంగళగిరి): మండలంలోని రామచంద్రాపురంలో కొలువై యున్న శ్రీ విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి వారి ఆరాధన బుధవారం నిర్వహించనున్నట్లు భక్త బృందం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

అనాథాశ్రమంలో అన్నదానం

నవులూరు(మంగళగిరి): మండలంలోని నవులూరు గ్రామంలో షారోన్ అనాథ ఆశ్రమంలోని బాలికలకు అన్నదానం నిర్వహించారు. బుధవారం కాండ్రు కోమల్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాత కోమల్ కుమార్, రిషిత శ్రీ దంపతులు, బాపనపల్లి శివరాం, మురికిపూడి నరేష్, సింగరాజు, సాయి, అర్వగట్ల పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా

తాడికొండ: పశువుల దాణా బ్యాగులు 50 శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తాడికొండ మండల పశువైద్యాధికారి రాయప్పరెడ్డి మంగళవారం తెలిపారు. తెల్లరేషన్ కార్డు రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. రూ.1,110 విలువ చేసే 50 కేజీల దాణా బ్యాగులను రాయితీపై రూ.550 ఇస్తారన్నారు. నియోజకవర్గానికి 25 మెట్రిక్ టన్నుల దాణా వచ్చిందన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్ యాప్‌లో నమోదు ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల-నరసరావుపేట రోడ్డులోని రైల్వే ట్రాక్ పక్క తోటలో గత నెల 27న హత్యకు గురైన వ్యక్తి మంగళగిరికి చెందిన ఇట్ట బాలకృష్ణగా(40) గుర్తించారు. పోలీసుల వివరాల ప్రకారం.. హత్యకు గురైన వ్యక్తితో పాటు మరో అయిదుగురు వ్యక్తులు మద్యం సేవించి తోటల్లో కూర్చున్నారు. మద్యం మత్తులో వారు ఘర్షణ పడ్డారు. బాలకృష్ణను మద్యం సీసాలతో కొట్టి, రాయితో తల పగలగొట్టి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు కారకులైన మంగళగిరికి చెందిన మొగిలి మాధవ, ఫిరంగిపురంకి చెందిన మేడ అశోక్, పాలపర్తి సాంబయ్య, మొగిలి గణేష్, బెల్లంకొండ తిరుపాల్‌ను, వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడికొండూరు సీఐ నాగుల మేరా సాహెబ్, ఎస్సై ఖాజీ బాబులు విచారించి అరెస్టు చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు 15 రోజులు రిమాండ్ విధించారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

- నెల రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు
- ఆరోగ్య పరిరక్షణ, సామాజిక అంశాలు, చట్టాలపై చైతన్యవంతం
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేలా రూపకల్పన



కొత్తపేట సచివాలయంలో అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ విజయలక్ష్మి, సీడీపీఓ సులోచన

మంగళగిరి: కౌమార దశకు చేరుకున్న బాలికలు ఆరోగ్య సమస్యలు, ఇతర ఒడిదుడుకులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం 'కిశోరి వికాసం' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. మహిళా శిశు సంక్షేమ శాఖ వేసవి సెలవులలో కిశోర బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టింది. బాలికలలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఇతర శాఖలను సమన్వయం చేసుకుని సామాజిక అంశాలతో పాటు విద్య, వైద్యం, నైపుణ్యం, క్రీడలు, చట్టాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించింది. మే 2 నుంచి జూన్ 10వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలను చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. మహిళా సంరక్షణ కార్యదర్శులు ,ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, డీఆర్‌డీఏ, వీఆర్‌పీ, ఏపీహెచ్‌డబ్ల్యూ తదితరులతో కూడిన బృందాలు కిశోర బాలికలకు ఆరోగ్యం, పోషకాహారం, వ్యక్తిగత పరిశుభ్రత, ఆత్మరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, అంశాలపై అవగాహన కల్పించనున్నారు.



కిశోర బాలికలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్‌లు

కార్యక్రమాల వివరాలు ఇలా..

ఈనెల 2 నుంచి జరుగుతున్న ఈ కార్యక్రమాల్లో 9న బాల్య వివాహాల నిర్మూలన, పునరుత్పత్తి, ఆరోగ్యంపై ప్రభావాలు.. 13న పిల్లల హక్కులు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ, పోక్సో చట్టం.. 16న కౌమార దశలో రక్త హీనత.. 20న లింగ అసమానత, ఆడపిల్లలపై వివక్ష, 23న విద్య, కెరీర్‌పై సూచనలు, నైపుణ్య ప్రాముఖ్యత.. 27న సైబర్ రక్షణ, ఆన్‌లైన్‌లో భద్రత, సమస్యలు.. 30న బాలికల నాయకత్వ లక్షణాలు, సాధికారికత.. జూన్ 6న క్రీడలు, యోగా, వ్యాయామం.. జూన్10న బాల్యవివాహాల నిర్మూలన వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు. 'కిశోరి వికాసం' కోసం వార్డు స్థాయిలలో మహిళా సంరక్షణ కార్యదర్శి కన్వీనర్‌గా అయిదుగురితో ప్రత్యేక కమిటీలను నియమించారు. ఇందులో అంగన్‌వాడీ టీచర్, బహుళార్థ సాధక ఆరోగ్య కార్యకర్త, గుర్తింపు పొందిన ఆరోగ్య కార్యకర్త, సచివాలయ ఆర్గనైజింగ్ అసిస్టెంట్ ముఖ్యపాత్ర పోషిస్తారు.

10,861 మంది బాలికలు తరగతులు..

14 ఏళ్ల నుంచి 18 ఏళ్ల లోపు బాలికలను గ్రూపులుగా విభజిస్తారు. వారికి ఎంపిక చేసిన అంశాలపై ఆయా ప్రాంతాల్లో అనువైన సమయంలో గంట పాటు శిక్షణ ఇస్తారు. బాలికలే లక్ష్యంగా పెరుగుతున్న మోసాలు, ప్రేమ పేరుతో వంచన, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, వాటిని ప్రోత్సహిస్తే తీసుకునే చర్యలపై అవగాహన కల్పించనున్నారు. అటువంటి వాటికి పాల్పడితే ఫిర్యాదు నంబరు 1098పై పూర్తి స్థాయిలో తరగతులు చెప్పనున్నారు. నియోజకవర్గంలోని మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో 83 సచివాలయాల పరిధిలోని 10,861 మంది బాలికలకు ఈ వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ శిబిరాలు ఎంతో ఉపయోగం..



'కిశోరి వికాసం' వేసవి శిబిరాలు బాలికలకు ఎంతో ఉపయోగకరం. సమాజంలో ఎలా మెలగాలో వివరిస్తాం. బాలికలకు హక్కులు, నైపుణ్యాల పెంపు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పిస్తాం. బాలికలకు ఏదైనా సమస్య తలెత్తినప్పుడు దాన్ని పరిష్కరించుకునే విధంగా వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించేలా చర్యలు తీసుకుంటాం.

– పి.విజయలక్ష్మి, పీడీ, ఐసీడీఎస్ గుంటూరు

పూర్తిస్థాయిలో అవగాహన..



'కిశోరి వికాసం'లో బాలికలకు ఎదురయ్యే సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తాం. బాలికలే లక్ష్యంగా మోసాలు పెరుగుతున్నందున నిర్దిష్ట ప్రణాళికతో వారికి అవగాహన కల్పించి అన్ని అంశాల్లో వారు సమర్థవంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం.

– సులోచన, సీడీపీఓ, మంగళగిరి ఐసీడీఎస్

చైతన్యవంతం చేస్తున్నాం..



ఈ కార్యక్రమాల ద్వారా బాలికలలో ఆత్మస్థైర్యం పెపొందించేలా ప్రణాళికలు రూపొందించాం. వేసవి సెలవులు కిశోర బాలికలకు ఉపయోగపడే విధంగా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలికలకు సామాజిక అంశాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేస్తున్నాం.

– బీజీ భవానీ, సూపర్‌వైజర్

పైపులైను పగిలి నీటి సరఫరాకు అంతరాయం



ఫిరంగిపురం: మండల కేంద్రంలో సొలస బస్టాండు వద్ద పలు గ్రామాలకు నీటి సరఫరా చేసే పైపులైను సోమవారం పగిలిపోయింది. దీంతో సిబ్బంది మంగళవారం మరమ్మత్తులు చేపట్టారు. రాత్రి సమయంలో భారీ వాహనాలు ఇటువైపుగా తిరుగుతుండటంతో పైపులైను దెబ్బతింటుందని ప్రజలు చెబుతున్నారు. పలు గ్రామాలకు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని.. ఆయా గ్రామాల ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికే పలుమార్లు పైపులైను పగిలిన చోట మరమ్మత్తులు చేశారని.. భారీ వాహనాలు బైపాసు రోడ్డుమీదుగా వెళ్లాలని.. ఇటుగా వస్తే ఈ సమస్య పునరావృతం అవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి భారీ వాహనాలు, లారీలు ఇటువైపు రాకుండా కట్టడి చేయాలన్నారు.

పెంచిన డీఏను కొనసాగించాలి

తాడేపల్లి రూరల్: వీఆర్‌ఏలకు పెంచిన డీఏను కొనసాగించాలని గ్రామ రెవిన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రాతూరు ప్రభాకరరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో రూ.300 ఉన్న డీఏను రూ.500 వరకు పెంచారని, పెంచిన డీఏను ఆరు నెలలు ఇచ్చి అనంతరం ఆపేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

విపత్తులతో రైతులు నష్టపోతున్నారు

- పంట నష్టం పరిశీలనకు అధికారులెవరూ రాలేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



పడిపోయిన అరటి తోటను పరిశీలిస్తున్న రామకృష్ణ

తాడేపల్లి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈదురు గాలులు, వడగండ్ల వానలు, ఇతర విపత్తుల వల్ల రైతులు పంట నష్టపోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని.. ప్రభుత్వం స్పందించి రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో అకాల వర్షంతో నేలకొరిగిన అరటి తోటలను ఆయన రైతులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల ఎకరాలలో వరి, మొక్కజొన్న వంటి పంటలకు నష్టం జరిగిందని.. మరో 2 వేల ఎకరాలు ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ఈ లెక్కలు ప్రభుత్వమే చెప్పిందని అన్నారు. సీఎం చంద్రబాబు 24 గంటల్లో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తీవ్రంగా పంటలకు నష్టం జరిగితే ఒక్క అధికారి కూడా రాకపోవడం, పంటలను పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య, సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శులు కంచర్ల కాశయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శులు తుడిమెల్ల వెంకటయ్య, సుహాస్, గుంటక సాంబిరెడ్డి, జవ్వాది సాంబశివరావు, సింగయ్య, రైతులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత



మంగళగిరి: ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నగర పరిధిలోని నిడమర్రు యు.పి.హెచ్.సి ఉద్యోగులకు, ఎస్ఆర్ఎం, అమృత వర్శిటీలలో సమ్మె నోటీసులు అందజేసినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎం.భాగ్యరాజ్, కె.రాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

మంగళగిరి టౌన్: మంగళగిరి రైల్వేస్టేషన్ సమీపంలో గత నెల 24వ తేదీన గంజాయితో ఇద్దరు యువకులు పట్టుబడగా వారిని రిమాండ్‌కు తరలించారు. నిందితులను విచారించగా మరో ముగ్గురు వారితో ఉన్నట్లు తెలిపారు. 'ఈగల్ టీమ్' మంగళగిరి పట్టణ పోలీసులు గంజాయి కలిగిన ఇద్దరి యువకులను గత నెల 24న కనుగొని వారి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు తమతో ఉన్నారని.. వారిలో మంగళగిరి బాపనయ్య నగర్‌కు చెందిన పవన్, నవులూరుకు చెందిన మరో ఇద్దరు యువకులు ఉన్నట్లు నిందితులు తెలిపారు. పవన్‌ను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగిలిన మరో ఇద్దరి యువకుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

అఖిల భారత సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ఫిరంగిపురం: కేంద్ర కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు ఈనెల 20న నిర్వహించే అఖిల భారత సమ్మెలో కార్మిక సంఘాలు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. మండలంలోని నుదురుపాడు, ఫిరంగిపురం పీహెచ్‌సీలో సోమవారం నిర్వహించిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలోని కార్మికవర్గం వందేళ్లకు పైగా పోరాటం చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నష్టం కలిగించేలా లేబర్ కోడ్‌లను తీసుకు వస్తుందని చెప్పారు. దీంతో కార్మిక వర్గం తిరిగి బానిసత్వంలోకి నెట్టనుందని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు దేశంలో నిరుద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంగన్‌వాడీలు, ఆశా వర్కర్లకు గత ప్రభుత్వం చేసిన ఒప్పందాలకు సంబంధించిన జీవోలు కూడా ఇవ్వడంలేదని.. దీనిపై ఉమ్మడి పోరాటానికి సిద్ధపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం రెండు పీహెచ్‌సీల వైద్యులు యానీగ్రేస్, శ్వేతలకు అఖిల భారత సమ్మెనోటీసులు అందజేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు పద్మావతి, పద్మలు పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



సాదియా ఆల్మాస్



నాగం జ్ఞానదివ్య



షేక్ షబీనా



షానూన్

మంగళగిరి: ఈనెల 5వ తేదీ నుంచి 12 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహరాడూన్‌లో జరుగుతున్న ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్, మెన్, ఉమెన్ క్లాసిక్, ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్, ఏషియన్ యూనివర్సిటీ కప్ క్లాసిక్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనే ఇండియన్ పవర్ లిఫ్టింగ్ టీమ్ ఎంపిక చేసినట్లు పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు కూరాకుల విజయ భాస్కరరావు, కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. బుధవారం వివరాలను వెల్లడించారు. ఈ పోటీలకు గుంటూరు జిల్లా నుంచి నలుగురు పవర్ లిఫ్టర్లు ఎంపికయినట్లు తెలిపారు. మంగళగిరికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మాస్ 57 కేజీల విభాగంలో, తెనాలికి చెందిన షేక్ షబీనా 84 కేజీల విభాగంలో, ఎం.షానూన్ 53 కేజీల విభాగంలో నాగం జ్ఞాన దివ్య 84 ప్లస్ కేజీల విభాగాల్లో పాల్గొంటారని తెలిపారు. పోటీలలో పవర్ లిఫ్టర్లు రాణించి పతకాలు సాధించాలని పవర్ లిఫ్టింగ్ అసోషియేషన్ ప్రతినిధులు కోరారు.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జయప్రదం చేయండి



మాట్లాడుతున్న చాంద్‌బాష

ఫిరంగిపురం: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఫిరంగిపురం తాలూకాయూనిట్ కార్యవర్గ సభ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష కార్యక్రమానికి హాజరయ్యి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జూన్‌లో నిర్వహించే రాష్ట్ర కౌన్సిల్ సమావేశం విజయవాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, తాలూకాయూనిట్ అధ్యక్షుడు కొండపల్లి సుదర్శనరాజు పాల్గొన్నారు.

జూనియర్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న కమిషనర్ చావలి సునీల్

మంగళగిరి, మంగళగిరి టౌన్: రాష్ట్ర సమాచార కమిషనర్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ వేళంగిణి కుటుంబానికి రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ మంగళవారం ఆర్థిక సహాయం అందజేశారు. వేళాంగిణి సోదరి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పాటు భర్త మృతి చెందడం, ఇద్దరు పిల్లలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందని సమాచారం అందుకున్న కమిషనర్ ఆమెకు రూ.25 వేలు అందజేశారు. పిల్లల చదువులకు అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చినట్లు వేళాంగిణి తెలిపారు. కార్యక్రమంలో పీఎస్.ఫణీంద్ర, డి.ఇ.వోలు వరప్రసాద్, వెంకట్, ఇందిర పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన భవానీపురం పిండాల ఘాట్ వద్ద జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మంగళగిరి ఎర్రబాలెంకు చెందిన పిల్లా లక్ష్మి(62) కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. గతేడాది ఆగస్టులో ఆపరేషన్ చేసి కడుపులో గడ్డ తొలగించారు. అయినా ఆమె కడుపు నొప్పి తగ్గలేదు. ఆమెకు కీమో థెరపీ చేస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటల సమయంలో కుమారుడు పిల్లా త్రినాథ్ రిపోర్టుల కోసం ఆసుపత్రికి వెళ్లాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తిరిగి వచ్చి చూడగా ఆమె ఇంట్లో లేదు. చుట్టుపక్కల వారిని, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ తెలియరాలేదు. మంగళవారం రాత్రి కృష్ణానదిలో భవానీపురం పిండాల ఘాట్ వద్ద మహిళ మృతదేహం లభ్యమైంది. దీంతో అక్కడికి వెళ్లి చూసిన త్రినాథ్ మృతదేహం తన తల్లి లక్ష్మీదేనని నిర్ధారించారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చనిపోవాలనే ఉద్దేశంతో కృష్ణానదిలో దూకి ఉంటుందని పోలీసులకు తెలిపారు. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు.

డీసీఎం పవన్ ముస్లింలకు క్షమాపణ చెప్పాలి

దుగ్గిరాల: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని భారత ప్రజాస్వామ్య లౌకిక రాజ్యాంగ పరిరక్షణ సమితి నాయకుడు షేక్ సుభాని డిమాండ్ చేశారు. మంగళవారం దుగ్గిరాల ముర్తుజానగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయ స్వలాభం , మతోన్మాదుల మెప్పుకోసం ముస్లింలను ఉగ్రవాదులతో పోల్చుతూ వాఖ్యలు చేశారని.. ఆయన వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉంటూ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా నిరాధార ఆరోపణలు చేయడం ముస్లింల మనోభావాలు దెబ్బతీయడమే అన్నారు. వాటిని వెనక్కి తీసుకుని ముస్లింలకు క్షమాపణలు చెప్పాలన్నారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్, షేక్ మస్తాన్ వలి, మహబూబ్ సుభానీ పాల్గొన్నారు.

అప్పుడు మట్టి, నీళ్లు.. ఇప్పుడు చాక్లెట్

- మోదీ పర్యటన వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తాడేపల్లి రూరల్: అమరావతి రాజధాని పునఃనిర్మాణ శంకుస్థాపన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.వందల కోట్లు ఖర్చుచేసిందని, ప్రధానమంత్రి మోదీ వస్తున్నారని ఆర్భాటంగా జనాలను తరలించారని, చివరకు ఒక చాక్లెట్ ఇచ్చి నోరు తీపి చేసుకోండి అంటూ వెళ్లిపోయారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. మంగళవారం తాడేపల్లిలోని ఈదురుగాలులు, వర్షానికి దెబ్బతిన్న అరటి తోటలు, పంటలను ఆయన పరిశీలించారు. రామకృష్ణ మాట్లాడుతూ అమరావతి పునఃనిర్మాణ శంకుస్థాపనకు ప్రధాని నరేంద్రమోదీ రావడంతో రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి 26 జిల్లాల నుంచి జనసమీకరణ చేసి అట్టహాసంగా కార్యక్రమం నిర్వహించారన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు మోదీని ఉత్సాహపరిచే విధంగా ప్రసంగాలు చేశారన్నారు. నరేంద్రమోదీ మాత్రం ఎటువంటి హామీలు ఇవ్వకుండా ప్రసంగాన్ని ముగించారన్నారు. గతంలో చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చారని, ఈసారి చాక్లెట్ ఇచ్చి నోరు తీపిచేసుకోండంటూ తన ప్రసంగాన్ని ముగించారని అన్నారు. రాజధాని నిర్మాణం అయితే చేస్తారు కానీ ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ఆంధ్రగా తీర్చిదిద్దుతారని, ప్రభుత్వం మరో 40 వేల ఎకరాలు భూ సేకరణకు సన్నాహాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయని, అదే జరిగితే ఉద్యమం తప్పదని, తీసుకున్న భూములను త్వరితగతిన అభివృద్ధి చేసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం

మేడికొండూరు: మెగా డీఎస్సీలో ఉర్దూ మీడియం ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు అధికారులు సరైన నిబంధనలు పాటించకపోవడంతో ఉర్దూ మీడియం చదువుకున్న అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందని గుంటూరు జిల్లా ఉర్దూ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యుడు షేక్ కరీముల్లా పేర్కొన్నారు. అభ్యర్థులు ఇంటర్‌లో ఉర్దూను రెండో భాషగా చదివినా ఉపాధ్యాయ అర్హత పరీక్షకు అనుమతించాలన్నారు. దీనికి అనుగుణంగా నిబంధనలు అమలు చేయాలని కోరారు. టెట్‌లో ఉర్దూ మీడియంలో అర్హత పొందిన మార్కులను మాత్రమే పరిగణలోకి తీసుకోవాలి అన్నారు. అధికారులు ఈ పద్ధతి పాటించకుండా ఉర్దూ మీడియం అభ్యర్థులకు అన్యాయం చేస్తున్నారు పేర్కొన్నారు.